

# వల్లంకిపిట్ట

అడపా

ఒకరోజున జువ్విచెట్టుమీద పిట్టలన్నీ చేరి చాలా సందడిగా సభ చేసినై. ఆ హడావిడికి కారణం ఏమిటంటే—కొద్దిరోజుల్లోనే ఆ పిట్టల్ని చూసి వెళ్లడానికి నెమిలిరాణీగారు రాబోతున్నారని కొంగదాసుగారు వచ్చి చెప్పివెళ్ళింది. నెమిలి రాణీగారు వస్తున్నారంటే పిట్టలన్నిటికీ చాలా సంతోషం వేసింది. "రాణీగారు వచ్చినప్పుడు మనమంతా చక్కగా ముస్తాబు చేసుకుని ఆటలాడాలి. పాటలు పాడాలి. రాణీగారు మనల్ని చూసి మెచ్చుకోవాలి. కనుక రాణీగారు వచ్చినప్పుడు మనలో ఎవరెవరు ఏమేమి వినోదాలు చేస్తారో ఇప్పుడే మనం తేల్చుకోవాలి" అని పెద్దపిట్ట సభలో చెప్పింది. అదే ఆ సందడి.



"నేను ప్రార్థన చేస్తాను. 'కువకువ'పాట పాడతాను" అన్నది పావురం.

"సరే-పాటకచేరీ చెయ్యడానికి నేనుండనే వున్నాను కదా. నేను మఱి గొంతు విప్పి ఒక రాగం విసిరానంటే రాణీగారు మఱచిపోగలదా?" అన్నది కోకిల.

"నిజం-నిజం" అని చిన్నపిట్టలు చప్పట్లు కొట్టినై.

"ఏం-పాడటానికి నేనుమాత్రం పనికిరానా యేమిటి?" అని గొణుక్కుంది కాకి. చిన్నపిట్టలు గొల్లుమన్నై.

"మేం చిన్నచిన్న ఆటలాడి చూపిస్తాం. చాలా ముచ్చటగా వుంటుంది" అని గువ్వలు అన్నై.

"నేను రంగురంగుల వేషం వేసుకుంటాను" అన్నది రామచిలుక.

"నేనుకూడా!" అన్నది పాలపిట్ట.

"సరే!" అన్నై చిన్నపిట్టలు.

"ఐతే మఱి నేనెందుకూ పనికిరానంటారా?" అన్నది గుడ్లగూబ.

"ఎందుకూ పనికిరాకపోవడమేమిటి? శకునాలు చెప్పడానికి మీరు చక్కగా పనికివస్తారుగా!" అని చిన్నపిట్టలు కిసుక్కుమన్నై.

"ఛీ! కాలం మరీ మండిపోతోంది. ఈ చిన్నపిట్టలకు ఈ మధ్య బొత్తిగా కళ్లే కనపడటం లేదు. నాకు మీ సభా వద్దు. మీ రాణీగారు వద్దు" అని తిట్టుకుంటో ఎగిరిపోయింది గుడ్లగూబ.



"సరేగాని ఉపన్యాసం ఎవరిస్తారు?" అని అడిగింది పెద్దపిట్ట.

"మన గోరువంక వుందిగా!" అన్నై చిన్నపిట్టలు.

ఇక వల్లంకిపిట్ట మిగిలిపోయింది.

"మఱి నువ్వేం చేస్తావు?" అని అడిగింది పెద్దపిట్ట.

"ఏం చెయ్యమంటారు?" అన్నది వల్లంకిపిట్ట.

"ఏదీ—ఒకపాట పాడు" అన్నది పావురం.

వల్లంకిపిట్ట కంఠమెత్తి కొంచెం పాడింది. కాని అంతగా బాగుండలేదు.

"లాభం లేదు!" అన్నది ఠీవిగా కోకిల.

"ఇంతకంటె నేను చక్కగానే పాడగలను. కాని నేను పనికిరానట!" అని తనలో గొణుక్కుంది కాకి.

"మరి ఆడగలవా ?" అని అడిగింది పెద్ద పిట్ట.

వల్లంకిపిట్ట ఆడబోయింది.

ఊహూ-ఏమీ బాగుండలేదు. ఇంతకంటె పాటే కొంచెం నయం.

ఇంతలో పాలపిట్టకు ఒకసంగతి జ్ఞాపకం వచ్చింది. వల్లంకిపిట్ట ఒయ్యారంగా తిరగడం తను చూసింది. కనుక వల్లంకిపిట్ట నాట్యంచేస్తే బాగుంటుందని సూచన చేసింది.

సరే-వల్లంకిపిట్ట నాట్యంచేసింది. చిన్నపిట్టలు చప్పట్లు కొట్టినై.

"ఒకమోస్తరుగా వుంది. ఫరవాలేదు"అన్నది రామచిలుక.

"నువ్వింకా నేర్చుకోవాలి. రోజూ నాట్యం చేస్తూవుంటే రాణీగారు వచ్చేటప్పటికి కుదురుతుందేమో !" అన్నది పెద్దపిట్ట.

సరే- ఆ నాటికి సభ ముగిసింది. గుడ్లగూబ మరి తిరిగి రానేలేదు. కాకికూడ మిగిలిన పక్షులతో మాట్లాడటం మానివేసింది. మిగిలిన పిట్టలు కులాసాగా గింజలు తింటూ సరసాలాడుకుంటూ కాలం గడుపుతున్నై.

వల్లంకిపిట్ట మాత్రం తెల్లవారుజామునే లేచి రోజూ నాట్యం చెయ్యడం నేర్చుకుంటున్నది. రానురాను నాట్యం చాలా చక్కగా వచ్చింది.

ఇంతలో రాణీగారు వచ్చేరోజు వచ్చింది. పిట్టలు రంగురంగుల పువ్వులూ, కొమ్మలూ తెచ్చి జువ్విచెట్టుకింద చక్కగా అలంకారం చేసినై. ఇంతలో నెమిలిరాణీగారు రానే వచ్చింది.

పావురం 'కువకువ' ప్రార్థన చేసింది. సరే. కోకిల చాలా ఠీవిగా వచ్చి పాటకచేరీ చేసింది. గువ్వలు ఆటలాడినై. చిలుకా, పాలపిట్టా రంగుల వేషాలతో వచ్చి రాణీగారిని ఆనందింపచేశాయి. గోరువంకగారు గడగడా తమ గంభీరమైన ఉపన్యాసం అప్పగించేశారు. అందరూ చప్పట్లు కొట్టారు.

వేడుకలన్నీ అయిపోయాయనుకుని నెమిలి రాణీగారు లేచి "మీ ఆటలూ, పాటలు-నాకు చాలా నచ్చినై" అని చెప్పబోయింది.

పెద్దపిట్ట అడ్డుపడి, "ఆగండి-కొంచెం ఆగండి మరి ! మా వల్లంకిపిట్ట నాట్యంకూడా చూడాలని మా మనవి" అన్నది.

వల్లంకిపిట్ట ఒయ్యారంగా సభలోకి వచ్చి, నాట్యంచేసింది. ఒకనిమిషం సభసంతటినీ ఊగించి వేసింది. అందరూ ఆశ్చర్యపోయారు.

"ఓహో ! ఎంత బాగుంది ! ఇంత చక్కటి నాట్యం నేను మరెప్పుడూ చూడలేదు. అన్నిటికంటె నాకీ నాట్యమే చాలా నచ్చింది" అని రాణీగారు మెచ్చుకున్నారు.

"ఓహో ! ఇదేమిటి మన వల్లంకిపిట్ట ఇంత అందంగా నాట్యంచేసిందే ! ఆ రోజున చేతకాలేదుగా !" అని అడిగింది రామచిలుక.

"మరేమిట్టనుకున్నావు !-ఏ పనినైనా రోజూ చేస్తూవుంటే చక్కగా చేతనవుతుంది. మిగిలిన పిట్టలన్నీ తమకు చక్కగా వచ్చుకదా అని ఊరుకున్నై. వల్లంకిపిట్ట మాత్రం రోజూ లేచి నాట్యం నేర్చుకుంది. అందుకే ఈ వేళ రాణీగారికి అన్నిటికంటె వల్లంకిపిట్ట నాట్యమే నచ్చింది" అని పాలపిట్ట చెప్పింది.

రాణీగారు వెళ్ళాక పెద్దపిట్ట ఒక చక్కని పువ్వుల పతకాని వల్లంకిపిట్టకు బహుమానమిచ్చింది. ఎప్పటికిమల్లేనే చిన్నపిటలు సంతోషంగా చప్పట్లు కొట్టాయి.

